ఉషకు అక్కడున్న పది పదిహేను మందిని చూసి ఒకింత ధైర్యం వచ్చేసింది. బిస్కట్స్‌కి, టీకి ఆర్డరిచ్చి బయటకు తొంగిచూస్తోంది. ఉష టీ బంక్‌లోకి వెళ్ళటం చూసిన సుందరమ్మ మనుషులు కొద్దిసేపు తటపటాయించి చివరకూ అక్కడే తాడో పేడో తేల్చుకునేందుకే నిర్ణయించుకున్నారు.

నలుగురు దృఢకాయలు టీ బంక్‌లోకి ఎంటర్ కాగానే ఆ బంక్ యజమాని కొద్దిగా భయపడ్డాడు. అందుకు కారణం గతంలో వాళ్ళు ఎలాంటివాళ్ళనేది తెల్సి వుండటమే. ఇప్పుడు సరిగ్గా ఆ నలుగురికి ఎదురుగా ఉదయ్ ఉన్నాడు. అతనికి వెనుకగా ఉష వుంది. ఉషకి కొద్దిదూరంలో యుగంధర్ పంపించిన సర్కిల్ వున్నాడు. కొద్దిసేపు వారిలో వారు గుసగుసలాడుకున్న తదుపరి ఓ నిర్ణయానికొచ్చి లేచి నించున్నారు ఆ నలుగురు.

"ఎక్కడి వాళ్ళక్కడే కూర్చుండిపోతే మీకే ప్రమాదం ఉండదు. మాక్కావల్సిన వాళ్ళను మేం పట్టుకెళ్ళిపోతాం... లేదంటే అనవసరంగా ప్రాణాలు పోగొట్టుకుంటారు" ఆ నలుగురిలో ఒకడు గర్జించాడు.

బంక్ యజమానికి చెమటలు పట్టేశాయి వారి మాటలు వింటూనే. ఉష ఒకింత భయంగా వారికేసి చూసింది. వాళ్ళు ఎవరిని ఉద్దేశించి హెచ్చరిక చేశారో అక్కడున్న ఎవరికీ అర్థం కాలేదు- ఒక్క ఉషకి తప్ప. సర్కిల్ ఆశ్చర్యపోలేదు.

ఇక్కడ...ఇంత పబ్లిగ్గా... పట్టపగలు దౌర్జన్యానికి దిగేవారున్నారా? అంటేఈ నగరంలో పోలీసులు నామమాత్రమేనా? అందుకే యుగంధర్ లాంటి సాహసి ఈ నగరాన్ని ఏరికోరి వుంటాడు.

ప్రమాదం ముంచుకొస్తే డ్యూటీలో లేకున్నా, అది తన జ్యూరిస్ డిక్షన్‌లో లేకున్నా వాళ్ళతో తలపడాలనుకున్నాడు సర్కిల్. ఉదయ్‌కి ఆ మాటలేవీ వినిపించటంలేదు.

అతని ఆలోచనలన్నీ తల్లి, అక్క చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. ఆ నలుగురిలో ఒకడు ఉదయ్ వెనుక వున్న ఉషకేసి చూశాడు. ఉష భయంతో మరింత ముడుచుకుపోయింది.

అతను ఒక్కొక్క అడుగేవేస్తూ ఉషవేపు కదిలాడు. టీ బంక్ అంతటా భయంతో కూడుకున్న నిశ్శబ్దం అలుముకుంది. ఎవరూ వార్ని ఆపే ప్రయత్నంలో వున్నట్లుగా తోచలేదు సర్కిల్కి.

కొద్దిసేపటికి వారు ఎవర్ని ఉద్దేశించి ఆ హెచ్చరిక చేసింది అర్థమయిపోయింది. ఒక ఆడపిల్లమీద దౌర్జన్యం. అక్కడున్న ఎవరూ ముందుకు రావడం లేదంటే ఆ గూండాలు పరమ కిరాతకులయి వుండాలి. అది తెలిసి పోలీసులకు కంప్లయిట్ ఇవ్వలేదంటే వారి వెనుక వున్న వ్యక్తులు అంత శక్తిసామర్థ్యాలు కలవాళ్ళయి వుండాలి. సర్కిల్ క్షణాల్లో అవన్నీ ఆలోచిస్తూనే ఉషను అవసరమైతే రక్షించేందుకు మానసికంగా సంసిద్ధుడయిపోతున్నాడు.

"ఏయ్ పిల్లా--మర్యాదగా దొరికిపో నిన్ను క్షేమంగా తీసుకెళ్ళి మా సుందరమ్మగారిముందు నిలబెడతాం. లేదంటే దౌర్జన్యానికి దిగి నిన్ను బలవంతంగా

ఎత్తుకుపోవల్సి వస్తుంది".

ఆ మాటలకు ఉష వున్న చోటుకే మరింతగా ముడుచుకుపోయిందేతప్ప ముందుకొచ్చే ప్రయత్నం చేయలేదు.

ఉష ముందుకొస్తుందేమోనని కొద్దిక్షణాలు ఎదురుచూశాడా వ్యక్తి. ఆమెలో అలాంటి ప్రయత్నమేదీ కనిపించకపోవటంతో కోపంగా ఒకడుగు ముందుకేశాడు.

అక్కడ అడ్డుగా ఉదయ్ వున్నాడు.

"అడ్డం లే..." అతను ఉదయ్‌ని ఉద్దేశించి హుంకరించాడు.

అవికూడా ఉదయ్ ఆలోచనల్ని చెదరగొట్టలేదు. తలవంచి, రెండు అరచేతుల్లో గడ్డాన్ని అన్చుకుని దీక్షగా నీళ్ళగ్లాసుకేసి చూస్తున్న ఉదయ్ ఏకాగ్రతను చెడగొట్టడం మామూలు కేకతో సాధ్యం కాదని గ్రహించిన అతను విసురుగా ఉదయ్ భుజంమీద చేయివేసి పక్కకు నెట్టాడు.

అలా నెట్టే ప్రయత్నంలోనే అతను ఆశ్చర్యపోయాడు. కనీసం అంగుళంకూడా ఉదయ్ శరీరం కదలలేదు.

అతనిలో సహనం చచ్చిపోయి ఈసారి మరింత గట్టిగా ఉదయ్‌ని పక్కకు నెట్టే ప్రయత్నం చేశాడు. అప్పటికి ఆలోచనల్లోంచి తేరుకున్న ఉదయ్ తలను కొద్దిగా పైకెత్తి ఏమిటన్నట్లు చూశాడు.

"పక్కకు తప్పుకో బే" అతను తిరిగి అన్నాడు.

అంతే...ఆ మరుక్షణం ఉదయ్ కొట్టిన దెబ్బకు అతనికి కళ్ళు బైర్లు కమ్మాయి. సన్నగా సాధారణంగా కనిపిస్తున్న ఉదయ్ అంతదెబ్బ కొట్టగల సమర్ధుడని ఆ వ్యక్తి ఊహించలేదు. ఎప్పుడయితే మొదటివ్యక్తి ఉదయ్ దెబ్బకు ప్రక్కకు తూలాడో వెంటనే మిగతా ముగ్గురూ రంకెలేస్తూ ఎగిరి ఉదయ్‌మీదకు దూకారు. ఊహించని ఆ హఠాత్పరిణామానికి అక్కడున్న కస్టమర్స్ భయంతో బిక్కచచ్చిపోయారు.

సర్కిల్‌లో ఆసక్తి రెట్టింపయింది. తను అనుకోకుండా టీబంక్‌కి రావటం... సరిగ్గా అప్పుడే ఎవరో యువతి కంగారుగా వచ్చి ఆ టీబంక్‌లో జొరబడటం ... ఆ వెనుకే
నలుగురు దృఢకాయులు అక్కడకు రావటం-- ఆ అమ్మాయిని మర్యాదగా తమతో వచ్చేయమనటం... ఆ వచ్చేయమనటం వెనకే సుందరమ్మ అనేపేరు వారి నోటివెంట బయట పడటం, ఆమె భయంతో వెనకే వుండిపోవటం, ఈలోపు ఒకడు ఆమెకు అడ్డుగావున్న వ్యక్తిని మామూలు మనిషిగా లెక్కేసి 'బే' అనటం.... ఆ తర్వాత భుజం పట్టుకు పక్కకు తోయటం, అతను రెచ్చిపోయి ఒక్కటివ్వటం-అక్కడే ఒకింత ఆశ్చర్యంతో సర్కిల్ ఆలోచనలు ఆగిపోయాయి.

చూట్టానికి గున్న ఏనుగులావున్న ఆ దృఢకాయుడ్ని సన్నగావున్న ఆ యువకుడు ఒక్కదెబ్బకే ఎలా మట్టి కరిపించగలిగాడు? స్ట్రేంజ్...
సమయం ముంచుకొచ్చినప్పుడు రంగంలోకి దిగవచ్చని భావిస్తున్న సర్కిల్ ఓ మామూలు

కస్టమర్‌లా జరగబోతున్న తంతును చూస్తున్నాడు ఆసక్తిగా.

ఒక్కసారి అనుకోకుండా తనమీదకు అకారణంగా రావటంతో ఒకింత ఆశ్చర్యపోయినా క్షణాల్లో తేరుకున్నాడు ఉదయ్. బంక్ యజమాని ప్రాణాలు రెపరెపమన్నాయి. అక్కడే వున్న మిగతా కస్టమర్స్ మరికొద్దిక్షణాల్లో అక్కడో ప్రళయం ముంచుకు వస్తుందన్న భయంతో చల్లగా జారుకోనే ప్రయత్నంలో వుండగా....

"ఇక్కడినుండి ఎవరూ బయకు వెళ్ళటానికి వీలులేదు. మీరంతా మా సుందరమ్మ తడాఖా అంటే ఏమిటో చూడాలి. మీరు ప్రత్యక్షసాక్షులు కావాలి. అందుకే ఎక్కడివాళ్ళక్కడ కూర్చుండిపోండి" ఆ నలుగురిలో చివరివాడు మిగతా ముగ్గురికి సహాయంగా వెళుతూ హుంకరించాడు.

తనమీదకు వరద ప్రవాహంలా దూసుకురాబోయిన నలుగురు వ్యక్తుల్ని ఒకచేత్తో నిరోధిస్తూ "మీరెవరో నాకు తెలీదు. మీకూ, నాకూ ఎలాంటి సంబంధం లేదు. అనవసరంగా నా జోలికి రాకండి. వస్తే మీ ఎముకలు మరిక మిగలవు" అన్నాడు ఉదయ్.

పిడుగుపాటులా ధ్వనించిన ఉదయ్ మాటలకు ఆ నలుగురు కొద్ది క్షణాలు తటపటాయించినా పొగరుగా ముందుకు దూకారు.

ఎంతో మర్యాదగా హెచ్చరించినా లెక్కచేయక తను మీదకు వచ్చిన అగంతకులకు మధ్య హోరాహోరి మొదలయింది. అక్కడున్న చెక్కబల్లలు, కుర్చీలు తునాతునకలయిపోతున్నాయి. అప్పటివరకూ ఎంతో పొందికగా వున్న టీ బంక్ ఇప్పుడు రణరంగంగా మారిపోయింది.

"నువ్వు మర్యాదగా తప్పుకో, అది మా సుందరమ్మ ఫైనాన్స్ కంపెనీ గురించి బేడ్‌గా వ్రాసింది. ఇవ్వాళ దాని అంతు చూడందే వదలం..." ఒకడు ఒగరుస్తూ అన్నాడు.

ఆ మాటలు విన్న ఉదయ్ ఓ క్షణం ఆశ్చర్యపోయి ఆమెవేపు చూశాడు. ఈమెనా ధైర్యంగా గోల్‌మాల్ చిట్ ఫండ్ కంపెనీ గురించి వ్రాసింది.

అంతలోనే చప్పున అగంతకులవేపు తిరిగి "నలుగురూ దున్నపోతుల్లా వున్నారు. ఒక ఆడపిల్లమీద దౌర్జన్యం చేయటానికి వచ్చినందుకు మీకు సిగ్గుగా లేదు" ఉదయ్ ఒకప్రక్క వారి దెబ్బల్ని కాసుకుంటున్నాడు.

ఉష ఉదయ్‌వేపు కృతజ్ఞతగా చూసింది. కానిప్పుడు ఎవరిదృష్టి ఆమెమీద లేదు.

"నీకనవసరం అంటున్నాను. మర్యాదగా ఇప్పటికయినా తప్పుకో" ఒకడు రంకె వేస్తున్నట్టుగా అన్నాడు.

ఆ నలుగురికి అప్పటికే ఒక విషయం అర్థమయిపోయింది. అతన్ని ఓడిస్తే తప్ప ఆ అమ్మాయిని తీసుకెళ్ళలేమని, కాని అతన్ని ఓడించటం అన్నది అంత తేలికయిన విషయంగా అనిపించటంలేదు. అలా అని ఆ అమ్మాయిని వదిలేసి వెళ్ళితే సుందరమ్మ తమని బ్రతకనివ్వదు. నిర్థాక్షిణ్యంగా చంపించి మూడో కంటికి తెలియకుండా తమ శవాల్ని కూడా

అదృశ్యం చేస్తుంది.

ఎలా? ఎలా...ఇప్పుడు?

అక్కడే వున్న సర్కిల్ విషయం ఒక్కొక్కటే అర్థమవసాగింది. ఉష ఒక జర్నలిస్ట్ అని, ఆమె ఈ ఆగంతకుల యజమానురాలయిన సుందరమ్మ ఇమేజ్‌ని దెబ్బతీస్తూ ఏదో పేపర్‌లో ఆర్టికల్ రాసిందని, అక్కడ పరిస్థితిని ఆకళింపు చేసుకుంటూనే అతను మరో విషయం గురించి ఆలోచనలో పడ్డాడు.

ఇతనెవరో చిచ్చరపిడుగులా వున్నాడు. ఇతనే ఆ ఉదయ్ అని తీసుకెళ్ళి యుగంధర్‌కి అప్పగిస్తే? అతను మర్చిపోయి చేస్తున్న తప్పు ఒక్కటే, తను యుగంధర్‌ని కల్సుకున్న మరుసటిరోజే యుగంధర్ జైలునుంచి తెప్పించి యిచ్చిన ఉదయ్ ఫోటోని బయటకు తీయకపోవటం.

అంతలో సర్కిల్ ఆలోచనల్ని చెరిపివేస్తూ పెద్ద శబ్దం. ఒకడు దొంగచాటుగా కుర్చీని లేపి ఉదయ్ తలకేసి గురిచూసి విసరబోయేంతలో ప్రమాదాన్ని పసికట్టిన ఉష అసంకల్పితంగా ఉదయ్‌ని ముందుకు నెట్టడంతో ఆ కుర్చీ వెళ్ళి ఓ టేబుల్‌కి తగిలి తునాతునకలయిపోయింది. కాని అప్పటికే ఆ కుర్చీకున్న ఇనుపమేకు ఉదయ్‌కి లోతుకి గుచ్చుకుపోయింది.

దాంతో ఉదయ్‌కి సహనం పూర్తిగా చచ్చిపోయింది "ఇవి జైల్లో కొండల్ని పిండి చేసిన ఉక్కుచేతులు, వాటి పనేమిటో క్షణాల్లో మీకు చూపిస్తాను" అంటూ ఉదయ్ చిరుతపులిలా వారి మీదకు విజృంభించాడు.

ఆ వేపుగా వస్తున్న జనాలు కొంతమంది టీ బంక్‌లో జరుగుతున్న బీభత్సాన్ని చూసి చేష్టలుదక్కి శిలల్లా మారిపోయారు. వీపునుంచి నెత్తురు వరదలా ప్రవహిస్తున్నా అతనికి కనీసం చీమ కుట్టినట్టయినా లేదు. చూస్తుండగానే క్షణాలలో నలుగురూ నిస్సత్తువతో కుప్పకూలిపోయారు.

సర్కిల్ ఉదయ్ బలానికి బిత్తరపోయి చూస్తున్నాడు. ఉదయ్ అన్న మాటల గురించే ఆలోచిస్తున్నాడు. జైల్లో కొండల్ని పిండిచేసిన చేతులంటే అర్థం... ఇతను ఒకప్పుడు ఖైదీ అనేగా? ఒక వేళ ఇతనే ఉదయ్ ఏమో? సర్కిల్ ఆలోచనలు క్రమంగా అతని కార్యసాధనకు దగ్గరవుతున్నాయి.

ఉష కంగారుగా ఉదయ్‌ని సమీపించి ఆందోళనగా అతనివేపు చూసింది. ఉదయ్ ఆమెను పట్టించుకునే స్థితిలో లేడు. అనవసరంగా జత బట్టలు పాడయ్యాయే అనే అతని ఆలోచనంతా. బట్టలు సరిచేసుకుంటూ బయటకు వెళ్ళేందుకు ఉద్యుక్తుడవుతుండగా---

"థాంక్యూ వెరీమచ్! ఈ దుర్మార్గుల నుంచి నన్ను కాపాడారు. మీ రుణం ఎలా తీర్చుకోను" అంది ఉష కృతజ్ఞత నిండిన మనస్సుతో.

ఉదయ్ ఓసారి ఉష వేపు సీరియస్‌గా చూసి "తెలివిగా కృతజ్ఞతలు చెప్పి

తప్పుకుందామనుకుంటున్నావేమో. నువ్వు రుణం తీర్చుకోక తప్పదు" అన్నాడు ఒకింత కఠినంగా.

ఆమెకు అర్థం కాలేదు అతనన్న మాటలు.

"ఇప్పుడు నేను అరగంట కాలాన్ని వృధా చేశాను. నేను నా కోసం, నా వాళ్ళకోసం మాత్రమే నా కాలాన్ని వాడుకుంటాను, అది వృధాయే అయినా, ఇతరుల విషయానికొచ్చినప్పుడు నాకాలం విలువ చాలా ఎక్కువ. సో... నా అరగంట కాలానికి వాళ్ళతో నేను చేసిన యుద్ధంలో నేను కోల్పోయిన ఎనర్జీకి, నా వంటిమీద పడిన దెబ్బలకు నేను కరెన్సీతో విలువ కడతాను. అంటే నువ్విప్పుడు నాలుగు వందలివ్వాలి. ఆదే నాపట్ల నీరుణం. మర్యాదగా నాలుగొందలిచ్చేసి వెళ్ళిపో" ఆ మాటలకు ఒక్క ఉషాయే కాదు, సర్కిల్ అక్కడున్న మిగతావారు బిత్తరపోయారు.

"మోస్ట్ ప్రాక్టికల్ మెటీరియలిస్టిక్ జెంటిల్‌మెన్" సర్కిల్ లోలోనే గొణుక్కున్నాడు.

ఉష ప్రతిమలా వుంది.

"ఏం అర్థం కాలేదు?" ఉదయ్ మాటలు ఖంగ్‌మన్నాయి.

ఉషకి అప్పటికిగాని అతని మాటలు సీరియస్‌గానే అన్నట్లు అర్థం కాలేదు. వెంటనే బ్యాగ్‌లోనుంచి నాలుగొందలు తీసి ఉదయ్‌కి అందించి "ఎనీ హౌ... థాంక్యూ వన్స్ ఎగెయిన్" అంది.

"డబ్బులిచ్చేసి రుణం తీర్చుకున్నావ్. అనవసరంగా కృతజ్ఞతని వృధా చేసుకోకు" అంటు ఆ నాలుగు వందనోట్లలోంచి మూడు పెట్టుకుని బయటకు నడిచాడు.

అంత ప్రాక్టికల్‌గా వుండే మనుష్యులు కూడా వున్నారా అన్న ఆశ్చర్యంతో సర్కిల్ రెండడుగులు బయటకు వేసి ఉదయ్‌ని ఆపాడు. ఉదయ్ చిరాగ్గా చూస్తూ ఏమిటన్నట్లు కనుబొమ్మలు ఎగరవేశాడు.

0 0 0

"పిచ్చి సుందరమ్మ! నీ దగ్గర అందమైతే వుంది కాని పిసరంత బుర్రకాయ లేదు. నలుగురు రౌడీ వెధవల్ని పంపితే పోయిన నీ పరువు తిరిగొస్తుందా? అది తెలిసి పత్రికలవాళ్ళు మరింత రెచ్చిపోతే? ఈ ప్రపంచంలో ఎవరినయినా బెదరించవచ్చుగాని పత్రికల వాళ్ళను కాదు హిట్లర్ అంతటివాడే పత్రికల్ని చూసి భయపడేవాడట" మధుమూర్తి సుందరమ్మ నునుపైన భుజాల్ని నిమురుతున్నాడు.

"పట్టాభి మంత్రి అయివుండి, మీరు కోటీశ్వరులయివుండి నాకీ పరువు తక్కువ పని జరగటం అవమానంగా వుంది. మీకు మాత్రం లేదా?" సుందరమ్మ గారాలు పోతూ అంది. అందులో ఒకింత నిష్ఠూరం కూడా తొంగిచూసింది.

“ఎందుకు లేదూ? అయితే ఎవరో? మనమంటే, మన శక్తిసామర్థ్యాలంటే తెలియనివాళ్ళు దుస్సాహసం చేశారు. దాన్నిప్పుడు సరిదిద్దుకుని సమయం చూసి చావుదెబ్బ కొట్టడమే తెలివి కలవాళ్ళ లక్షణం”.